క్లుప్తంగా

అద్దంకి నాంచారమ్మ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



అవనిగడ్డ: కోడూరు మండలం విశ్వనాథపల్లిలో వేం చేసి ఉన్న శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాల వాల్ పోస్టర్లను అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు సోమవారం ఆవిష్కరించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఆలయ ప్రతినిధులతో కలిసి వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఉత్సవాలు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు, నియోజకవర్గ యువ నాయకుడు సింహాద్రి వికాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్థాన మండపానికి శంకుస్థాపన

అవనిగడ్డ: ప్రాచీన శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయ ఆవరణలో ఆస్థాన మండపం నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. రూ.25 లక్షలు వ్యయంతో నిర్మించనున్న ఆస్థాన మంటపానికి ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరరావు, ఆలయ ఈఓ పీ.సీతారామయ్య భూమిపూజ చేశారు. ఈ మండపం స్వామివారికి సంబంధించిన విశేష పూజలు, ఊంజల్ సేవ, శయనోత్సవ కార్యక్రమాలకు వినియోగించేందుకు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ధర్మకర్తల కుటుంబీకులు అందించే సహాయంతో ఈ నిర్మాణం చేపడుతున్నారు. ఆగమ పండితులు దీవి పార్థ వెంకటరామ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భూమిపూజ జరుపగా అర్చక స్వాములు దీవి వెంకట్రామాచార్యులు, అప్పలాచార్యులు, బీ.వేణుగోపాలాచార్యులు, ధర్మకర్తలు వేణుగోపాలరావు, వీ.వెంకట్రావ్, జయరామకృష్ణ పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షించుకుందాం

మోపిదేవి: ఆడపిల్లలను రక్షించి కాపాడుకుందామని కళాజాత బృందం నాయకుడు శేఖర్‌బాబు అన్నారు. మండల కేంద్రం మోపిదేవి ప్రధాన సెంటర్‌లో సోమవారం సాయంత్రం కళాజాత నిర్వహించారు. బృందం నాయకులు శేఖర్ కళాజాత ద్వారా మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పిల్లలకు చిన్నవయస్సులోనే వివాహం చేయకుండా కనీసం మగ వారికి 25, ఆడ పిల్లలకు 21 సంవత్సరాలు నిండే వరకు పెళ్లి చేయరాదని ప్రభుత్వం చట్టం చేసిందని తెలిపారు. అంతకుముందు ఎంపీడీఓ కార్యాలయంలోనూ కళాజాత ప్రదర్శించారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



నాగాయితిప్ప(మోపిదేవి): మండల పరిధిలోని మోపిదేవి లంక గ్రామానికి చెందిన రైతు మోర్ల తిరుపతి వెంకయ్య ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబానికి గ్రామ సర్పంచ్ మోర్ల జ్యోత్స్న సోమవారం రూ.10 వేలను మృతుడి కుమారుడు అంకమరావుకు అందజేశారు. మృతుడికి నాగాయితిప్ప పీఏసీఎస్‌లో సభ్యత్వం ఉండడంతో ఆర్థిక సాయం అందించామన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు, మండల బీసీ కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరావు, సొసైటీ సిబ్బంది విశ్వనాథపల్లి హరీష్ పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం



మచిలీపట్నంటౌన్: నగరంలోని గొడుగుపేట శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి పునః ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం, సాయంత్రం విశేష పూజలు, యాగాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలను బ్రహ్మశ్రీ విష్ణుభట్ల సూర్యనారాయణశర్మ బ్రహ్మత్వంలో ఆలయ అర్చకులు ముత్తేవి చక్రవర్తి ఆచార్యులు, ముత్తేవి వెంకటపార్థసారథి కృష్ణమాచార్యులు, ముత్తేవి లీలా లక్ష్మీపతిఆచార్యులు పూజా క్రతువులను జరిపారు. పూజా కార్పొరేటర్ గోపిశెట్టి సతీష్, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్లు జవ్వాది రాంబాబు, శ్రీకాకోళపు రేణుకారాణి, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధి నూకల ప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీల్లో ప్రతిభ



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం ఆంధ్రజాతీయ కళాశాలలో జరిగిన అంతర్ రాష్ట్ర అండర్-14 క్రికెట్ పోటీల్లో నిడుమోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న మాచిరాజు పద్మసూదన్ ప్రతిభ కనబరిచాడు. పద్మసూదన్ బౌలింగ్‌లో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. దీంతో నిర్వాహకులు పద్మసూదన్‌కు ట్రోఫీ, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. పద్మసూదన్‌ను స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ మధుకిరణ్, నిడుమోలు గ్రామ సర్పంచ్ కె.అంజలి, హెచ్‌ఎం అన్నపూర్ణమ్మ, పీఈటీ ఉంగరాల లక్ష్మీనారాయణ అభినందించారు.

అభివృద్ధి దిశగా తీరప్రాంతం

- 216 జాతీయ రహదారి 90 శాతం నిర్మాణం పూర్తి
- భూముల ధరలకు రెక్కలు, పెరిగిన వ్యాపారాలు
- మెరుగుపడిన రవాణా వ్యవస్థ



కృత్తివెన్ను మండలంలో విస్తరించిన 216 జాతీయ రహదారి

కృత్తివెన్ను: జిల్లాకు శివారు ప్రాంతం.. ఉద్యోగులకు పనిష్మెంట్ ఏరియా.. అభివృద్ధికి ఆమడదూరం.. అనే స్థితి నుంచి అన్నింటా నేనే ముందు అనే స్థాయికి తీరప్రాంతమైన కృత్తివెన్ను మండలం అభివృద్ధి దిశగా పరుగులు తీస్తోంది. దీనికి ప్రధాన కారణం 216 జాతీయ రహదారి నిర్మాణమే. గతంలో రహదారి పనులు ప్రారంభమైనప్పటికీ అవి నత్తనడకనే సాగాయి. గడిచిన మూడేళ్ల కాలంలో ఎన్‌హెచ్ పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయి. నియోజకవర్గ కేంద్రమైన పెడన నుంచి జిల్లా సరిహద్దు ప్రాంతమైన పల్లెపాలెం వరకు సుమారు 45 కిలోమీటర్లు మేర 216 హైవే పెడన నియోజకవర్గంలో విస్తరించి ఉంది. ముఖ్యంగా తీర ప్రాంతమైన కృత్తివెన్ను మండలంలో దాదాపు 25 కిలోమీటర్లు మేర రహదారి విస్తరించింది.

ఇతర జిల్లాలతో పెరిగిన అనుబంధం..

కృష్ణాజిల్లాకు పక్కనే ఉన్న పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాలతో పాటు విశాఖ జిల్లాతోనూ ఇప్పుడు రవాణా సంబంధాలు మరింత మెరుగయ్యాయి. భీమవరం, నరసాపురం, పాలకొల్లు, కాకినాడ, కేంద్రపాలిత ప్రాంతమైన యానంలకు ఈ ప్రాంతం మీదుగా ఆర్టీసీ సేవలు నడుస్తున్నాయి. దీంతో భిన్న సంస్కృతులతో పాటు వ్యాపారాభివృద్ధికి ఇది దోహదం చేస్తుంది. విజయవాడ నుంచి భీమవరం, నరసాపురం, కాకినాడ తదితర ప్రాంతాలకు ఆర్టీసీ నిర్వహిస్తున్న రవాణా (కార్గో) సేవలు సైతం ఈ ప్రాంతం మీదుగానే సాగుతున్నాయి.

వ్యాపారాలకు అనుకూలం..

తీరప్రాంతమైన కృత్తివెన్ను మండలంలో చేపల వ్యాపారాలు జోరుగా సాగుతాయి. గతంలో ఇక్కడి మత్స్యకారులు తాము వేటాడిన చేపలను దళారులకు విక్రయించుకోవాల్సి ఉండేది. వారి కష్టానికి సరైన గిట్టుబాటు ధర లేకపోయినా వేరు మార్గం లేక దళారులకే విక్రయించేవారు. ఇప్పుడు రవాణామార్గాలు సులభతరం కావడంతో గంగపుత్రులు తమ ఉత్పత్తులకు సరైన ధర రాకపోతే వారే నేరుగా నరసాపురం, కాకినాడలకు వెళ్లి విక్రయించుకుంటున్నారు.

విస్తరించిన వ్యాపారాలు..

జాతీయ రహదారి నిర్మాణంతో వ్యాపారాలు విస్తరించాయి. కృత్తివెన్ను, లక్ష్మీపురం ప్రధాన సెంటర్లలో పెద్ద పట్టణాలలో ఉండే మాదిరి కొత్త వ్యాపారాలు పుట్టుకు వచ్చాయి. ఈ ప్రాంతాల్లో భూముల ధరలు సైతం భారీగా పెరిగాయి. గతంలో సాధారణ రైతు కుటుంబాలు సైతం ఇప్పుడు పెరిగిన భూముల ధరలతో తమ ఆర్థిక పరిస్థితి మెరుగైంది.



ఆశాజనకంగా వ్యాపారాలు..

జాతీయ రహదారి నిర్మాణంతో రవాణా వ్యవస్థ మెరుగుపడింది. మా ప్రాంతంలో చిన్నా చితకా వ్యాపారులు కూడా సుదూర ప్రాంతాలకు తమ ఉత్పత్తులను విక్రయించుకోవడానికి వెళ్లడంతో పాటు ఇతర వ్యాపారాలకు అక్కడి వస్తువులను నేరుగా కొనుగోలు చేసుకుని ఇక్కడ వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీంతో సామాన్యుల ఆర్థిక స్థితి కూడా మెరుగైంది.

– తిరుమాని రమేష్
స్థానికుడు, కృత్తివెన్ను



భూముల ధరలు పెరిగాయి

గతంలో కంటే ఇప్పుడు మా ప్రాంతంలో భూముల ధరలు పెరిగాయి. గ్రామాల్లో సైతం వ్యాపారాలు పెరగడంతో సామాన్యుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది. కొంతకాలంగా కొత్త వ్యాపార కేంద్రాలుగా వెలిశాయి. దీంతో స్థానికులకు ఉపాధి అవకాశాలు వచ్చాయి. పంచాయతీల్లో అభివృద్ధి శుభపరిణామం. ప్రజలు ఆనందంగా ఉన్నారు.

– పులగం సుబ్రహ్మణ్యం,
లక్ష్మీపురం సర్పంచ్

తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూడండి

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ జ్యోత్స్నరాణి
- కౌన్సిల్ సాధారణ సమావేశంలో 14 అంశాలు ఏకగ్రీవంగా ఆమోదం





కౌన్సిల్ సమావేశానికి హాజరైన సభ్యులు (ఇన్‌సెట్‌లో) మున్సిపల్ ఛైర్‌పర్సన్ జ్యోత్స్నరాణి

పెడన: రానున్న వేసవిలో తాగునీటికి ఇబ్బందుల్లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నరాణి ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ జ్యోత్స్నరాణి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం జరిగింది. అజెండాలోని 14 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. పలు అంశాలపై చర్చ జరగ్గా మున్సిపల్ అధికారులు సమాధానం ఇచ్చారు. తరకటూరులో నుంచి పెడనకు వచ్చే పైపులైను గూడూరులో మరమతులు త్వరిగతిన పూర్తి చేయాలన్నారు. అదే విధంగా ప్రస్తుతం రామరాజు చానల్ ద్వారా వస్తున్న నీటి ప్రవాహానికి అడ్డుగా ఐరన్ వాల్ నిర్మించేలా ప్రణాళికలు రూపొందించి తక్షణం అమలు చేయాల్సిందిగా సూచించారు.

రైల్వే గేటు సమస్య పరిష్కరించాలి..

21వ వార్డు కౌన్సిలర్ పిచిక సతీష్‌బాబు మాట్లాడుతూ రైలు గేటు పడితే అరగంట వరకు తెరుచుకోని పరిస్థితి ఏర్పడిందని, రైల్వే అధికారులతో పాటు పోలీస్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుని సమస్య పరిష్కరించేలా చూడాలని కోరారు. డ్రెయినేజీ సమస్య తీవ్రంగా వెంటాడుతుందని, తక్షణం మురుగునీరు పారుదలయ్యేలా చూడాల్సిందిగా కోరారు. 11వ వార్డు ఉప ఎన్నికకు సంబంధించి ఆ వార్డుకు చెందిన ఓటర్ల జాబితా కాకుండా 23 వార్డుల ఓటర్ల జాబితాలను ముద్రించడంపై 12వ వార్డు కౌన్సిలర్ పార్వతీ ప్రశ్నించారు. దీనిపై టీపీఓ ఏసుబాబు సమాధానం ఇస్తూ 11వ వార్డులో పట్టణంలోని 23 వార్డులకు చెందిన వారు ఎవరైనా పోటీ చేయడానికి అవకాశం ఉన్నందున ఎన్నికల నియామావళిని అనుసరించి ఓటర్ల జాబితాలను ముద్రించడం జరిగిందన్నారు. నోటీసు బోర్డులో మాత్రం 11వ వార్డుకు సంబంధించిన జాబితా మాత్రమే ప్రదర్శించామని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు ఎండీ ఖాజా, బైలపాటి జ్యోతి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కటకం ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

మోపిదేవిలో తాగునీటి సమస్యకు త్వరలో మోక్షం



ట్యాంక్ నిర్మాణానికి స్థలం పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ప్రకాష్

మోపిదేవి: మండల కేంద్రమైన మోపిదేవికి దశాబ్దాలుగా ఏర్పడిన తాగునీటి సమస్యకు త్వరలో మోక్షం కలుగనుంది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సోమవారం పాల్గొన్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుకు గ్రామస్తులు ప్రధానంగా మంచినీటి సమస్యను వివరించారు. వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ప్రకాష్‌తో మాట్లాడటంతో ఆయన హుటాహుటిన గ్రామానికి చేరుకుని స్థలం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ విలేకరులతో మాట్లాడుతూ.. మోపిదేవిలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానానికి రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు నిత్యం వస్తున్నందున మంచినీరు అధికంగా అవసరం ఉందని గుర్తించామన్నారు. పంచాయతీ స్థలం తీర్మానం చేసి అప్పగించిన వెంటనే ఆయా గ్రామాల్లో నిర్మాణాలు చేపడతామని స్పష్టంచేశారు. ఇప్పటికే రావివారిపాలెం గ్రామానికి రూ.35 లక్షలు, బోడగుంట దళితవాడకు మరో రూ. 48 లక్షలు నిధులు మంజూరైనట్లు ప్రస్తుతం టెండర్ దశలో ఉన్నాయన్నారు. మోపిదేవికి కూడా ప్రత్యేకంగా మరో వాటర్‌ట్యాంకు మంజూరైనట్లు చెప్పారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు సూచనలతో అతి త్వరలోనే ఆయా గ్రామాల్లో వాటర్ ట్యాంకులు నిర్మించి ప్రజల దాహార్తిని తీర్చుతామన్నారు.

అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



బోడగుంటలో ప్రజలకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

బోడగుంట(మోపిదేవి): అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు త్వరితగతిన అందించడంలో జగనన్న ప్రభుత్వం ఎల్లప్పుడు ముందే ఉంటుందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తెలిపారు. మండల కేంద్రం మోపిదేవి శివారు బోడగుంట దళితవాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే సింహాద్రి, ఆయన తనయుడు, యువనేత సింహాద్రి వికాస్‌బాబుతో కలిసి సోమవారం 561 గృహాలను సందర్శించారు. గ్రామ సచివాలయం-2 పరిధిలోని బోడగుంటలో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పథకాలు వివరించి, ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ.. పారదర్శకంగా అర్హులైన అందరికీ ఫలాలు అందాలన్నదే జగనన్న సంకల్పమన్నారు. యువనేత వికాస్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఇంటా మంచి స్పందన వస్తోందని, గ్రామాల్లో ఇంకా సమస్యలు తెలుసుకోవడానికి వస్తే అపూర్వ స్వాగతం పలుకుతున్నారని తెలిపారు. 2024 ఎన్నికలకు మరింత ఉత్సాహంగా పనిచేస్తూ మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్‌లు నందిగం మేరీ రాణి, గరికిపాటి వెంకటేశ్వరావు, ఎంపీటీసీ సభ్యులు కారుమూరి శివనాగరాజు, సనకా వెంకట రాజేష్‌బాబు, పీఏసీఎస్ చైర్ పర్సన్లు రావి రామ ప్రసాద్, రెడ్రౌతు వెంకట రమణ, రాజులపాటి నాగేశ్వరావు, మోర్ల శ్రీనివాసరావు, కామిశెట్టి వెంకట సురేష్‌బాబు, నందిగం అభిషేకరావు, పలుశాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

లబ్ధిదారుల జీవితాల్లో వెలుగులు

పేర్ని కిట్టు



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: ప్రభుత్వ పథకాలు లబ్ధిదారుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) అన్నారు. నగరంలోని 21వ డివిజన్ బందుకోటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రెండో రోజైన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ డివిజన్‌లోని గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ ప్రాంత ప్రజలకు నవరత్న పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరిస్తూ ముద్రించిన బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేశారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పేదల నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తున్నారన్నారు. సుదీర్ఘ పాదయాత్రలో వైఎస్ జగన్ బడుగు, బలహీన వర్గాల సమస్యలను ఆకళింపజేసుకుని ఆ సమస్యలను పరిష్కరించే దిశగా పాలన అందిస్తున్నారని చెప్పారు. దీంతో ఆయా వర్గాల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. పేర్ని కిట్టు వెంట కార్పొరేటర్ మన్నే శారదా, డివిజన్ ఇన్‌చార్జి మన్నే శేషారావు, కార్పొరేటర్లు ఐనం తాతారావు, తిరుమలశెట్టి ప్రసాద్, పడమట రేవతి, నాయకులు బూరగ రామారావు, గాజుల భగవాన్, పురంశెట్టి శ్రీనివాసరావు, గంగుల నరసింహారావు పాల్గొన్నారు.

మంచి ఫలితాలు సాధిస్తేనే మెరుగైన జీవితం



మచిలీపట్నంటౌన్: విద్యార్థులు పదో తరగతిలో మంచి ఫలితాలు సాధిస్తేనే మెరుగైన జీవితం సాధించేందుకు వీలు కలుగుతుందని డీఈఓ తాహెరాసుల్తానా అన్నారు. నగరంలోని హిందూ కళాశాల ఆడిటోరియంలో సోమవారం పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే మచిలీపట్నం నగరంలోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ సబ్జెక్టుల్లో మంచిమార్కులు సాధించేందుకు తీసుకోవాల్సిన మెళకువలను ఆమె విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మచిలీపట్నం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి యువీ సుబ్బారావు, బందరుకోట మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టీవీ రఘుకాంత్, పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్నియాల దానం



నాగమల్లేశ్వరి (ఫైల్)

నాగాయలంక(అవనిగడ్డ): నాగాయలంక నాలుగో వార్డుకు చెందిన కనిగంటి నాగమల్లేశ్వరి(67) మృతి చెందగా ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. నేత్రదాన మోటివేటర్ కనిగంటి వెంకట నారాయణ తన మాతృమూర్తి నాగమల్లేశ్వరి సోమవారం మృతి చెందగా నేత్రదానం చేశారు. సుదర్శి మానవతా సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్ విజయవాడ ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలకు సమాచారం అందించగా, డాక్టర్ సాయి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది చేరుకుని నాగమల్లేశ్వరి నేత్రాల నుంచి కార్నియాలు సేకరించి తరలించారు. సుదర్శి సంస్థ చొరవతో 171వ నేత్రదానం చేయించినట్లు రఘుశేఖర్ తెలిపారు.

31లోగా పన్నులు చెల్లించండి

మచిలీపట్నంటౌన్: 2022-23 ఆర్థిక సంవత్సరం ఆస్తి, నీటి, ఖాళీ స్థలాల పన్నులను మార్చి 31వ తేదీలోగా చెల్లించాలని కమిషనర్ చంద్రయ్య సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పన్నులను సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలన్నారు. మార్చి 31వ తేదీ అర్ధరాత్రి 12 గంటల్లోపు పన్నులను చెల్లించవచ్చునన్నారు. పన్నులను నగరపాలక సంస్థ కార్యాలయం, సచివాలయాల్లో ఏర్పాటు చేసిన కౌంటర్లలో చెల్లించాలని తెలిపారు.

11వ వార్డు ఉప ఎన్నికకు ఏర్పాట్లు

పెడన: పట్టణంలో ఖాళీగా ఉన్న 11వ వార్డు కౌన్సిల్ ఉప ఎన్నిక నిర్వహించడానికి ఎన్నికల సంఘం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఆ వార్డుకు సంబంధించిన ఓటర్ల ముసాయిదా జాబితాను పురపాలక అధికారులు సిద్ధం చేశారు. పెడన పురపాలక సంఘంలో 23 వార్డులున్నాయి. వీటిల్లో ఇప్పటికే 21వార్డులను వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంది. 11వ వార్డుకు చెందిన కౌన్సిల్ మల్ల కోటమ్మ(68) అనారోగ్యంతో 2021 నవంబరులో మృతి చెందారు. ఆమె చనిపోయి 15 నెలలు గడుస్తోంది. వాస్తవంగా ఎన్నికల నియామావళిని అనుసరించి ఆరు నెలలకు ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉన్నా ఎన్నికల సంఘం ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా పురపాలక సంఘాల్లో ఖాళీలు ఏర్పడిన వార్డులు వాటి వివరాలను కోరడమే కాకుండా ఓటర్ల జాబితాల ప్రదర్శన చేయాలని సూచించడంతో పురపాలక అధికారులు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో ప్రకటించిన నియోజకవర్గాల ఓటర్ల తుది జాబితా ఆధారంగానే సోమవారం 11వ వార్డుకు సంబంధించి ఓటర్లు తుది జాబితాను ప్రదర్శించారు. మార్చి మొదటి వారం లేదా ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తవ్వగానే వార్డు ఉప ఎన్నిక నోటిఫికేషన్ వెలువడవచ్చుననే విషయాన్ని పురపాలక అధికారులు పేర్కొంటున్నారు. 11వ వార్డు ఉప ఎన్నికకు సంబంధించి అంతా సిద్ధం చేశామని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు.

తుది ఓటర్ల జాబితా ప్రదర్శన

పెడన:పట్టణంలోని 11వ వార్డు ఉప ఎన్నికకు సంబంధించి ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆ వార్డు ఓటర్లు తుది జాబితాను నోటీసు బోర్డులో పెట్టినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం. అంజయ్య తెలిపారు. పురపాలక సంఘ కార్యాలయంలోని నోటీసు బోర్డులో ఓటర్లు జాబితా ప్రదర్శన అనంతరం ఆయన మాట్లాడుతూ ఆ వార్డు కౌన్సిలర్ మల్ల కోటమ్మ మృతితో కౌన్సిలర్ సీటు ఖాళీ అయిందన్నారు. ఎన్నికల సంఘానికి పంపించిన సమాచారంతో తుది ఓటర్లు జాబితా ప్రదర్శించాలని వచ్చిన ఉత్తర్వులు ప్రకారం ప్రదర్శించామన్నారు. ఆ వార్డులో 1,328 మంది ఓటర్లు ఉన్నారని, పురుషులు 666, మహిళలు 662 మంది ఉన్నారని వివరించారు. ఎస్టీ జనరల్‌కు ఈ కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. టీపీఓ టి.ఏసుబాబు, మేనేజర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితాల ప్రచురణ

గూడూరు: మండలంలోని కోకనారాయణపాలెం పంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నికలతో పాటుగా జక్కంచర్ల, ఆకులమన్నాడు, పోలవరం గ్రామాల్లోని వార్డు ఉప ఎన్నికలకు ఓటరు జాబితాలు ప్రచురించారు. కోకనారాయణపాలెం సర్పంచ్ బండి రమేష్ మృతి చెందటంతో పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. దీనితో పాటుగా జక్కంచర్లలోని 1వ వార్డు, ఆకులమన్నాడులోని 5వ వార్డు సభ్యులు మృతి చెందారు. పోలవరంలోని 11వ వార్డు సభ్యురాలు పామర్తి విమల కన్యాకుమారికి అంగన్‌వాడీ ఉద్యోగం రావడంతో ఆమె తన పదవికి రాజీనామా చేశారు. దీంతో కోకనారాయణపాలెం సర్పంచ్ పదవితో పాటుగా మిగిలిన మూడు గ్రామాల్లోని వార్డు సభ్యుల ఉప ఎన్నికలకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆయా పంచాయతీ కార్యదర్శులు గ్రామంలోని పంచాయతీ కార్యాలయాల్లో సోమవారం ఓటరు జాబితాలు ప్రచురించారు.

మండలంలోనూ ప్రదర్శన

పెడన: మండలంలోని కొంగంచర్ల పంచాయతీ సర్పంచ్, కాకర్లమూడి పంచాయతీలోని నాలుగో వార్డు సభ్యుని ఉప ఎన్నికలకు సంబంధించి ఓటర్లు జాబితాలను ప్రదర్శించినట్లు ఈఓపీఆర్డీ ఎం.జయరాము తెలిపారు. కొంగంచర్ల సర్పంచ్ ఇటీవల మృతి చెందడంతో సర్పంచ్ పదవి ఖాళీ ఏర్పడిందన్నారు. అలాగే కాకర్లమూడి నాలుగో వార్డు సభ్యుడు మృతితో వార్డు సభ్యుని పదవి ఖాళీ ఏర్పడిందని, వీటికి సంబంధించి ఓటర్లు జాబితాలను ఆయా పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించామని ఆయన తెలిపారు.

వేదఘోషతో పులకించిన కోడూరు



పూర్ణాహుతి సామగ్రిని ఊరేగిస్తున్న భక్తులు

కోడూరు: వేదఘోషతో కోడూరు గ్రామం పులకించింది. స్థానిక గంగాభవానీ అమ్మవారి 11వ పునః ప్రతిష్ఠోత్సవాలను పురస్కరించుకొని సోమవారం నిర్వహించిన మహా చండీయాగంలో భక్తజనం పాల్గొన్నారు. ఉదయం చిన్నఅమ్మవారి విగ్రహానికి కలశపూజలు, పుష్పాభిషేకాలను కనులపండువగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు, ప్రధానార్చకులు కొమ్మూరి శ్రీనివాసశర్మ దంపతులతో పాటు మరో 14 మంది దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి చండీయాగాన్ని జరిపారు. చండీయాగంతో లోకం సుభిక్షంగా ఉండడంతో పాటు రైతులు పాడిపంటలతో సమృద్ధి చెందుతారని పండితులు అనుగ్రహభాషణ చేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. మహా పూర్ణాహుతి సామగ్రితో ఉభయ దాతలు ఆలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం గర్భాలయంలోని గంగాభవానీ అమ్మవారి ముందు ఉంచి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. మూలమూర్తిని విశేషంగా అలంకరించారు. ఆరు వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు.

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ విజయవాడ సెంట్రల్ పరిశీలకులు కడవకొల్లు నరసింహరావులు మహా చండీయాగంలో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. కమిటీ నిర్వాహకులను అభినందించారు. జెడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకటసత్యానారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, ఎంపీటీసీలు బడే గంగాధరరావు, తిమ్మన నాంచారయ్య, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ ముద్దినేని చంద్రరరావు, ఆర్యవైశ్య ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు



అవనిగడ్డ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద ఏపీ ప్రభుత్వం సౌజన్యంతో ఫిష్ ఆంధ్ర బ్రాండ్ నుంచి ఏర్పాటు చేస్తున్న హబ్ నుంచి మినీ ఫిష్ వెండింగ్ యూనిట్స్‌కు లైవ్ ఫిష్, డ్రై ఫిష్, మ్యాగ్నేటెడ్ ఫిష్, ఫ్రెష్ ఫిష్, పికిల్స్ ఇలా అన్నింటినీ సరఫరా చేసేందుకు రూ.12,99,975 విలువ కలిగిన టాటా ఏసీ వాహనాన్ని చల్లపల్లి మండలం వక్కలగడ్డకు చెందిన కుంపటి శ్రీకాంత్‌కు అందజేశారు. ఎస్సీలకు అరవై శాతం రాయితీ, కేంద్ర ప్రభుత్వ రాయితీ 36 శాతం, రాష్ట్ర ప్రభుత్వ రాయితీ 24 శాతం మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు, ప్రభుత్వ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

విలేజ్ క్లినిక్స్ ద్వారా ఇంటింటా వైద్య సేవలు

మోపిదేవి: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన జగనన్న హెల్త్‌క్లినిక్స్ గ్రామాల్లో మంచి ఫలితాలు ఇస్తున్నాయని మోపిదేవి పీహెచ్‌పీ వైద్యులు లక్ష్మీనాథ్, అనిల్‌కుమార్ తెలిపారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ.. హెల్త్ క్లినిక్స్ వల్ల దూరప్రాంతాల్లో కార్పొరేట్ హాస్పిటల్స్‌కు వెళ్లకుండా ఇంటి వద్దనే రోగులను పరిశీలించి ఉచితంగా మందులు ఇస్తున్నామన్నారు. మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. మండలంలోని 12 ఆర్బీకేల్లో 7 ఆర్బీకేల్లో ట్రాక్టర్‌తో పాటు వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు అందించామని, మిగిలిన 5 ఆర్బీకేల్లో త్వరలో అందిస్తామన్నారు. ఎంఈఓ కె.రాజ్‌కుమార్, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్ ఆయా శాఖల్లో ప్రగతిని వివరించారు. ఎంపీడీఓ పార్వతి, ఎంఈఓ కే రాజ్‌కుమార్, పలుశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.